ప్రజాశక్తి
శనివారం 12 అక్టోబర్ 2024
అనంతపురం



చెడుపై మంచి గెలుపే దసరా

మంత్రి సవిత



ప్రజాశక్తి-పెనుకొండ

చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా జరుపుకుంటున్న దసరా పండుగ ప్రజలందరి జీవితాలను సుఖమయం చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆకాంక్షించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు విజయదశమి శుభాకాంక్షలను శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. చెడుకు దూరంగా, మంచిగా దగ్గరగా జీవించాలని విజయదశమి సూచిస్తోందన్నారు. యువత విజయదశమి పండగ ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకుని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అభిలషించారు.



చెంద్రాయిని కుంట జలాశయంలో నీరు

నీరు వృథా..రైతుల వృథ..!

ఆయకట్టు భూములు సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో నిర్మించిన చెంద్రాయిని కుంట (జలాశయం)నీరు పంట పొలాలకు అందకుండా వృథాగా బయటకు వెళ్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో కొన్నేళ్లుగా సాగునీరు ఆయకట్టు భూములకు అందడం లేదు. నీరున్నా రైతులకు ఉపయోగ పడని పరిస్థితి నెలకొంది. తూముల మరమ్మతులపై అధికారులు , ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించకపోవడంతో నీరు వృథాగా బయటకు వెళ్తోంది.

తూము సరిగా లేకపోవడంతో వృథాగా బయటకు పోతున్న నీరు

- చెంద్రాయినికుంట ఆయకట్టు కాలువ శిథిలం
- తూము నుంచి వృథాగా పోతున్న నీరు
- 7 వేల ఎకరాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలం చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 70 ఎంసిఎఫ్‌టి సామర్థ్యంతో చెంద్రాయిని కుంట జలాశయంను నిర్మించింది. కొంత కాలానికి ఆ జలాశయానికి హంద్రీనీవా ద్వారా కృష్ణ జలాలను గుత్తి ఉప కాలువ ద్వారా మళ్లించారు. చెంద్రాయిని కుంట కింద దాదాపు 7 వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గుత్తి మండలంలోని చెర్లోపల్లి, బ్రాహ్మణపల్లి, పూలకుంట,పెద్దొడ్డి, అనగాని దొడ్డి, అబ్బేదొడ్డి, పామిడి మండలంలోని అయ్యవారిపల్లి, గుంతకల్లు మండలంలోని గుర్రబ్బాడుతోపాటు సమీప గ్రామాల పరిధిలో ఉన్న ఆయకట్టు భూములకు కాలువ ద్వారా సాగునీరు సరఫరా అయ్యేది. మూడేళ్ల క్రితం కొందరు స్వార్థంతో లిఫ్ట్ (తూము)ను ధ్వంసం చేశారు. దీంతో చెంద్రాయిని కుంటకు వస్తున్న నీరు లిఫ్ట్ లీకేజీతో వృథాగా వెళ్తోంది. జలాశయానికి సంబంధించిన కట్ట కూడా బలహీనంగా ఉంది. కట్టపై ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పూడికతీత పనులు కూడా చేపట్టడం లేదు. ఆయకట్టు కాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. జలాశయం పూర్తిస్థాయిలో నిండి ఆయకట్టుకు సాగునీరు వదిలితే ఆ నీరు కాలువలో ఎక్కడకక్కడే నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఎన్నో ఏళ్లుగా చెంద్రాయినికుంట, ఆయకట్టు కాలువ, గుత్తి ఉప కాలువ అధునీకరణ పనులకు నిధులు మంజూరు కావడం లేదు. కాలువలు ఆధునికరణ పనులు జరిగితే సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జలాశయం తూమును పూర్తి స్థాయిలో మరమ్మతు చేసి, సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చెంద్రాయిని కుంట జలాశయం కింద ఉన్న ఆయకట్టు

ఆయకట్టుకు నీరిస్తాం

చెంద్రాయినికుంటని పూర్తిస్థాయిలో నీటితో నింపే అవకాశం ఉంది. తూము వద్ద వరిగడ్డితో పూడ్చి వేసి నీరు వథా కాకుండా చేస్తాం. 7వేల ఎకరాల ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తాం. తాగునీరు సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతాం.

ఎం.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.

కేంద్రం ప్యాకేజీ కంటే మద్యం ఆదాయమే ఎక్కువ..!

- ఉమ్మడి జిల్లాలో 4421 దరఖాస్తులు
- మద్యం టెండర్ ఆదాయం రూ.88.41 కోట్లు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చిన ప్యాకేజీ కంటే మద్యం టెండర్ దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయమెక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ కింద కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.50 కోట్లు ఇచ్చింది. దానికంటే ఈ ఏడాది నిర్వహించిన మద్యం టెండర్ ఆదాయం ఎక్కువగా ఉండటం గమనార్హం. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన కొత్త విధానంతో మద్యం దుకాణాల నిర్వహణ ప్రయివేటుకు ఇచ్చారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచారు. సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచారు. ఇందులో అనంతపురం జిల్లాలో 136 దుకాణాలకు 3022 దరఖాస్తులొచ్చాయి. దీనికి ఒక్కో షాపుకు రెండు లక్షల చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 3022 దరఖాస్తులకు చెల్లించిన మొత్తం రూ.60.4 కోట్లు. సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు 1399 దరఖాస్తులు అందాయి. దీనికి రూ.27.98 కోట్లు ఆదాయం సమకూరనుంది. మొత్తం కలిపితే రూ.88.42 కోట్లు ప్రభుత్వానికి రుసుం రూపంలో ఆదాయం సమకూరనుంది.

అనంతలో పోటాపోటీ...తాడపత్రి నామమాత్రం

అనంతపురం నగరంలో మద్యం దుకాణాలకు టెండర్లు పోటాపోటీగా దాఖలయ్యాయి. 15వ దుకాణంకు అత్యధికంగా 47 దరఖాస్తులందాయి. 45 దుకాణంకు 46 దరఖాస్తులందాయి. నగరంలో కొంత మంది ఏకంగా వంద దరఖాస్తులు కూడా చేసిన వారున్నారు. తాడిపత్రిలో 104, 100, 99 నంబరు దుకాణాలకు రెండు దరఖాస్తులు మాత్రమే పడ్డాయి. ఇవి తాడిపత్రి పట్టణంలో మాత్రమే ఉన్నాయి. మరికొన్ని చోట్ల మూడు దరఖాస్తులు వేశారు. మరికొన్ని చోట్ల తొమ్మిది నుంచి 30కిపైగా దరఖాస్తులు పడ్డాయి.

అధికారపార్టీ కనుసన్నల్లోనే

మద్యం దుకాణాల టెండర్లను దక్కించుకునేందుకు అధికారపార్టీ నేతలు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ప్రధానంగా ప్రజాప్రతినిధుల అనుయాయులే దక్కించకునే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. కొన్ని చోట్ల అధికారపార్టీ నేతలే పోటీలు పడటం కనిపించింది. ఈనెల 16వ తేదీన మద్యం టెండర్లను నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో లక్కీ డ్రా తీయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టే పనిలో ఎక్సైజ్ శాఖ నిమగ్నమైంది.

సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్ర

- 15న బొమ్మనహాల్‌లో ప్రారంభం
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



బస్సుయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, తదితరులు

జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుండి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువన తుంగభద్ర డ్యాం, కిందన శ్రీశైలం పూర్తిగా నిండినా జిల్లాకు రావాల్సిన నీరు తెచ్చుకోలేని దుస్థితి ఉందన్నారు. హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ చేపట్టి 14 సంవత్సరాలు అయినా ఇప్పటికీ పని పూర్తికాలేదన్నారు. తుంగభద్ర డ్యాం గేట్లు పూర్తిగా చెడిపోయినట్లు ఆర్ఆర్.బజాజ్ నేతత్వంలోని నిపుణుల కమిటీ తేల్చిందన్నారు. తక్షణం కొత్త గేట్లు అమర్చాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన నిధులను కేటాయించా లన్నారు. హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు పంట కాల్వలను ఏర్పాటు చేయాలన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. బీటీ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లోని కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలన్నారు. పిఎబిఆర్ కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులకు నీరు అందించా లన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంటపొలాలకు నీరు ఇవ్వాలన్నారు. ఈనెల 15వ తేదీ ఉదయం బొమ్మనహాల్‌లో బస్సుయాత్ర బయలుదేరి 27 మండలాలు, వంద గ్రామాల మీదుగా కొనసాగుతుందని చెప్పారు. 21వ తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బస్సుయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ

బొమ్మనహాల్ : సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ చేపడుతున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఉంతకల్లు గ్రామంలో రైతులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. బస్సుయాత్రలో ఆయకట్టు రైతులు, ప్రజాప్రతితులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ, కౌలు రైతులు పాల్గొన్నారు

సిపిఎం బస్సు యాత్ర డిమాండ్లు

- నిర్లక్ష్యానికి గురవుతున్న తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికరణ చేయాలి
- తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు ఏర్పాటు చేయాలి.
- హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలి.
- హంద్రీనీవా ఆయకట్టుకు నీరు ఇవ్వాలి.
- ఉంతకల్లు జలాశయ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలి.
- భైరవాణితిప్ప ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి.
- రైతు సామూహిక బిందుసేద్య పథకాలను పూర్తి చేయాలి.
- ఉభయ అనంతపురం జిల్లాలో సాగునీటి తాగునీటి పథకాలను పూర్తి చేయాలి.
- శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగు రెడ్డి పథకాలకు నిర్వాణకు నిధులు కేటాయించాలి.
- చెరువులు కుంటలను నీటిపారుదల కాలువలతో అనుసంధానం చేయాలి.
- పిఎబిఆర్ డ్యామ్ నుంచి కుడికాలువకు నీరు ఇచ్చి 49 చెరువులను నింపాలి.

వర్షంతో నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి-రాయదుర్గం, రాయదుర్గం రూరల్

నియోజకవర్గంలో గురువారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు జలమయయ్యాయి. అత్యధికంగా కణేకల్లు మండలంలో 37 మిల్లీమీటర్లు, రాయదుర్గం-30.6, గుమ్మగట్ట-26.8, డి.హీరేహాల్-33, అత్యల్పంగా బొమ్మనహాల్ మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఓ మోస్తరు వర్షం కురిసినప్పటికీ పట్టణంలోని దుగ్గిలమ్మ గుడి, మధు టాకీస్, తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. 74-ఉడేగోళం, మల్లాపురం చెరువులు నీటితో నిండాయి. బొమ్మక్కపల్లి, వద్రవన్నూరు, గుమ్మగట్ట మండలంలోని గలగల, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో మిర్చి, టమోటా పంట పొలాలు నీట మునిగాయి. కర్నాటకలోని రంగయ్యనగుడ్డ రిజర్వాయర్ నీటితో నిండిపోవడంతో రాష్ట్ర సరిహద్దులోని చిన్నహగరి, పెద్దహగరి నదుల్లో నీరు ఉధృతంగా ప్రవహించాయి. అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి వద్రవన్నూరు గ్రామంలో కల్వర్టు కుంగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వద్రవన్నూరు గ్రామనికి చెందిన అనంతమ్మ, సావిత్రికి సంబంధించిన నాలుగు ఎకరాల్లో చీనీ చెట్లు నీటి మునిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షం కురిసనా పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రాయదుర్గంలో కాలనీలో చేరిన వర్షం నీరు

వేదవతి నదికి వరద

బొమ్మనహాల్ : మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి వేదవతి నదిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వరద నీరు పరుగులు తీసింది. తెల్లవారుజామున డి.హీరేహాల్, రాయదుర్గం మండలాలతో పాటు ఏలంజి, సోమలాపురం, కొత్తూరు, ఖానాపురం, తిమ్మలాపురం, కొలగానహల్లి, తదితర పై గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు బళ్లారి-కణేకల్లు ప్రధాన రహదారిపై వేదవతి నది నీటి ప్రవాహం ఉధృతంగా సాగింది. దీంతో బస్సులు, వాహనాల రాకపోకలు గంటసేపు స్తంభించాయి. వేదవతి నదిలో వరద ప్రవాహం కారణంగా నది పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయి. వేదవతినదిలో బోరు బావులు, విద్యుత్ మోటర్లు, మోటార్ సర్వీసు వైర్లు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి వర్షాలు లేక అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చిందని చెప్పవచ్చు.



వద్రవన్నూరు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను చూపిస్తున్న రైతు

తాగునీటి సరఫరా కార్మికులతో చర్చలు సఫలం

వేతనాలు, పిఎఫ్, ఇతర సమస్యల పరిష్కారానికి అంగీకారం - సమ్మె విరమణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


నీలకంఠాపురం, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులతో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి. బకాయి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 29వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. గురువారం నాడు సిఐటియు నాయకులు, కార్మికులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చలు నిర్వహించారు. చర్చల్లో భాగంగా తక్షణమే వేతనాలు చెల్లింపునకు ఆయా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఏ కాంట్రాక్టర్ ఏ నెల వేతనాలు చెల్లించాలి, పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఎలా చెల్లిస్తారు.... అన్న విషయాలపై అధికారులు కాంట్రాక్టర్లు కార్మిక సంఘాల నాయకులతో ఒప్పంద హామీ పత్రాన్ని రాసి ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్టర్, ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ సంస్థ కాంట్రాక్టర్‌లు సంతకాలు చేసి ఒప్పంద పత్రాన్ని కార్మికులకు అందజేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు సంబంధించి వేతన బకాయిలు పిఎఫ్‌లు అక్టోబర్ 15వ తేదీ లోపు రెండు నెలల వేత్తనాలు, 30వ తేదీలోపు మూడు నెలల వేతనాలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లను కార్మికులు అధికారులు ముందు ఉంచారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు 2023 డిసెంబర్ నెల జీతాలు, పిఎఫ్ కాంట్రాక్టర్ వై.శివారెడ్డి అక్టోబర్ 30వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ కలాం నాయుడు కళ్యాణదుర్గం రాయదుర్గం కార్మికులకు 2022 సంవత్సరంలో నాలుగు నెలలా 20 రోజుల పిఎఫ్ చెల్లించాల్సి ఉంది. ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి 2024 జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు నాలుగు నెలల వేతనాలు రూ.17200, పిఎఫ్ తో కలిపి ప్రతి కార్మికునికీ అక్టోబర్ 2024 15వ తేదీలోపు రెండు నెలల జీతాలు, అక్టోబర్ 2024, 30వ తేదీలోపు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. 2024 సంవత్సరం ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు డిఫరెన్స్ అమౌంట్ వెయ్యి రూపాయలు చొప్పున ప్రతి కార్మికునికీ చెల్లించాలి. ఆరు నెలల పిఎఫ్ బకాయలు కట్టని కార్మికులందరికీ 30వ తేదీలోపు చెల్లించాలి. 21 మంది కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి. మిగతా కార్మికులు రెండు నెలల వేతనాలు 15వ తేదీ లోపు చెల్లించాలి. ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ సంస్థ శివశంకర్ రెడ్డి కాంట్రాక్ట్‌ను 2024 సంవత్సరం వరకు రద్దు చేయాలి. కార్మికులపై కక్ష సాధింపులు ఉండరాదు. ఈ డిమాండ్ల అన్నింటినీ పరిష్కరించేలా అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్లు ఒప్పంద హామీ పత్రాన్ని రాసి అందజేశారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులు, సిపిఎం, సిపిఐ, రైతు కార్మిక సంఘాల నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

జెసి నుంచి ప్రాణహాని : పెద్దారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాడు అనంతపురం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, సాక్షాత్తు జిల్లా ఎస్పీ జగదీశ్ సహకారంతోనే ఆయన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల పోలింగ్ నుంచి ఇప్పటి వరకు పలుమార్లు తనను చంపేందుకు ప్రయత్నాలు చేసారని పేర్కొన్నారు. తన అన్న కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డిని చంపినట్టే తననూ హతమార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. జెసి అనుచరులకు ఎస్పీ జగదీశ్ పూర్తి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సిట్ విచారణ చేసిన ఘటనలపైనా మళ్లీ కేసులు ఎందుకు నమోదు చేశారో ఎస్పీ చెప్పాలని ప్రశ్నించారు. జెసి ఆదేశాలతోనే తనను తాడిపత్రికి ఎస్పీ అనుమతించటం లేదని మండిపడ్డారు. గతంలో ఆయన అనుమతితో తాడిపత్రి తన ఇంటికెళ్లినా దాడి చేసారన్నారు.

ఎమ్మెల్యేకు ఫీల్డ్‌అసిస్టెంట్ల సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి-కుందుర్పి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు 'లండన్‌లో గాంధీ లీడర్ షిప్ అవార్డు' అందుకొన్న సందర్భంగా శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికలో కుందుర్పి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు ఘనంగా సన్మానించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే సురేంద్రబాబు నేతృత్వంలో మండల వ్యాప్తంగా 400 మంది రైతులకు హార్టికల్చర్ ద్వారా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి రైతుల అభివృద్ధికి సహాయ సహకా రాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు సత్యనారాయణ(సత్తి,) మంజునాథ, 13 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, కుందుర్పి టౌన్ టిడిపి కన్వీనర్ రంగనాథ, తదితరులు పాల్గొ న్నారు.



జెసిబితో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది


ప్రభుత్వాసుపత్రిలో పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసయ్య సూచనలతో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో ముళ్లపొదలు పెరగడం, చెత్త చెదారం, వ్యర్థాలు పేరుకుపోయి ఉండడంతో ఆసుపత్రి సిబ్బంది, రోగుల సౌకర్యార్థం జెసిబితో ముళ్లపొదలను, చెత్తను తొలగించినట్లు తెలిపారు. అలాగే గుంతలను పూడ్చి వేశారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



కెవికె కోఆర్డినేటర్ చిన్నరాయుడు

రబీ పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ చినరాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం రబీ పంటల సాగుపై స్థానిక కెవికెలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పప్పుశనగ సాగు చేసే రైతులకు అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకూ మంచి అదును అని వివరించారు. పంట సాగు సమయంలోనే మోస్తరు నుంచి భారీ వర్షాలు రావడం శుభ పరిణామం అన్నారు. మట్టిలో తేమ శాతాన్ని గుర్తించి అదను చూసి విత్తనం వేయాలన్నారు. తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలన్నారు. విత్తన సాగు అనంతరం ముందు జాగ్రత్తగా కలుపు మొక్కల నివారణకు మరోసారి సేద్యం చేయాలన్నారు. మొక్క ఎదుగుదలను గుర్తించి చీడపీడల నివారణకు రసాయనిక మందులు పిచికారి చేయాలన్నారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు ఎరువులు, మందులు పిచికారి చేయాలన్నారు.

బురద కాదు.. దారే..!



బురదమయంగా మారిన నాగిరెడ్డిపల్లి-గుడిపల్లి దారి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పైన కనపడుతోంది బురద కాదు.. దారే.. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ దారి ఇలాగే మారుతుంది.. ఈ దారిలో వెళ్లాలంటే వృద్ధులు, చిన్నపిల్లలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే.. ఎక్కడే కాదు.. బ్రహ్మసముద్రం మండలంలోని నాగిరెడ్డిపల్లి నుంచి గుడిపల్లికి వెళ్లే దారి ఇది....

వివరాలోకి వెళ్తే... మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి నుంచి గుడిపల్లికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలయమంగా మారింది. నాగిరెడ్డిపల్లి నుంచి ముద్దులాపురం, గుడిపల్లి, గుడిపల్లి పైదొడ్డి గ్రామాలకు వెళ్లాంటే ఈ దారిగుండా వెళ్లాల్సిందే. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు నిత్యం తోటలకు, రాయదుర్గం పట్టణానికి వెళ్తూ ఉంటారు. ఇటీవల భారీగా కురిసిన వర్షాల కారణంగా రోడ్డు చిత్తడిమయంగా మారి దారి పూర్తిగా స్తంభించింది. దారంతా బురదతో నిండి ఉంది. దీంతో ఇటుగా వెళాల్సిన ప్రజలు, రైతులు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతుల్లో చేయిస్తే అయినా బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫ్లెక్సీల చించివేత తగదు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మేయర్ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫ్లెక్సీలు చించివేయడం తగదని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. దసరా పండుగ సందర్భంగా నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ వద్ద మేయర్ మహమ్మద్ వసీం నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే గురువారం రాత్రి కొందరు వీటిని చించివేశారు. దీంతో శుక్రవారం ఎస్పీ, డీఎస్పీని కలవడానికి మేయర్ ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాకపోవడంతో 2వ పట్టణ సీఐ శ్రీకాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇందుకు సిఐ స్పందిస్తూ ఫ్లెక్సీలు చించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు. అనంతరం మేయర్ మహమ్మద్ వసీం విలేకరులతో మాట్లాడుతూ తాను మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నిమతాల పండుగలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నానన్నారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో అన్నిపార్టీల వారితోపాటు కుల సంఘాల నేతలు, వ్యాపారులు, ప్రయివేటు వ్యక్తులు ఆయా సందర్భాలను బట్టి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోనేవారన్నారు.



2వ పట్టణ సిఐకి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

కొన్నిరోజుల తర్వాత కార్పొరేషన్ అధికారులు వాటిని తొలగించేవారన్నారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఫ్లెక్సీలు కక్షపూరితంగా తొలగిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాష్టంలో రెడ్‌బుక్ పాలన కొనగసాగుతోందన్నారు. ఫ్లెక్సీలు తొలగింపు రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఏమైనా ఉందా.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నగరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, నరసింహులు, కమల్‌భూషణ్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదికలో శుక్రవారం ఎమ్మెల్యే ఉద్యాన పంటలు, ఉపాధి పనులపై నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యాన పంటలకు సంబంధించి బిల్లులు ఆలస్యం లేకుండా త్వరగా వచ్చేలా చూస్తామని తెలిపారు. కరువు ప్రాంతమైన కళ్యాణదుర్గం అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగా నియోజకవర్గంలో 3,500 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు అనుమతులు ఇచ్చారన్నారు. అవసరమైతే మరిన్ని ఎకరాలకు అనుమతులు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో మన ప్రాంతానికి కృష్ణా జలాలు వస్తాయని రైతులు పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు సాగు చేసిన పంటలకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చకుండా రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు. ఇదివరకూ ప్రభుత్వం కేటాయించిన పథకాల్లో రైతులు భాగస్వాములు కావాలని అందుకోసం అధికారులు కూడా అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని ఈ నెల 15వ తేదీ పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో అందరినీ కలుపుకుని సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. చెరువుల్లో పూడికతీత, కాలువల పునరుద్ధరణ, ఫారంపాండ్లు, తదితర పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మోరేపల్లి మల్లి కార్జున, లక్ష్మీనారాయణచౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రమేష్, వెంకటేశులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు తగ్గట్టుగా గ్రామాభివృద్ధి

ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామాభివృద్ధిలో ఎటువంటి మార్పులు చేపట్టాలన్న దానిపై ఎఎఫ్ ఎకాలజీ కేంద్రం ఆధ్వర్యంలో ఎఎఫ్ ఎకాలజీలో జరిగిన రెండు రోజుల సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగ నాపుణులు, వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముగింపు రోజున నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైయిమెట్ రిలిజెంట్ అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ ఇన్‌వెస్టిగేటర్ ఎం.ప్రభాకర్ పాల్గొని ప్రసంగించారు. వాతావరణంలో వస్తున్న మార్పుల గురించి ఆయన వివరించారు. అనంతపురం జిల్లాలో గడిచిన వందేళ్ల వర్షపాతం గణాంకాలను అధ్యయనం చేస్తే జిల్లాలో వర్షపాతం తగ్గకున్నా, వర్షపాతం నమోదయ్యే రోజులు తగ్గాయని వివరించారు. మారిన ఈ వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ వాతావరణానికి తగ్గట్టు ఏ రకమైన మార్పులు చేపట్టాలన్నది స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలు అందరూ కలసి క్షేత్రస్థాయిలో మరింతగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు. వాసన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అడుసుపల్లి రవీంద్ర మాట్లాడుతూ మారుతున్న వాతావణానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతులు, భూ వినియోగం, ఉత్పత్తి వ్యవస్థల వినియోగంలోనూ మార్పులు చేపట్టాల్సిన అవసరముందని సూచించారు. వర్షాభావ ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఎఎఫ్ ఎకాలజీ చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాల ఆవశ్యకత గురించి ఆయన తెలిపారు. ప్రాజెక్టు సాంకేతిక సలహాదారు ఎన్‌హెచ్.రవీంద్రనాథ్ ఐదేళ్ల కాల వ్యవధిలో చేపట్టే ప్రాజెక్టు అమల్లో ఏదైనా మంచి జరుగుతుందన్నది ప్రయోగాత్మకంగానూ అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరత్వాడా కృషి విద్యాపీఠ్ మాజీ వైస్ ఛాన్సలర్ బండి వెంకటేశ్వర్లు, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ టి.ఎలమందారెడ్డి, స్టడీ రీ ఫార్మ హెడ్ గీతాంజలి రాజమణి, ఎఫ్‌ఈఎస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి బక్తర్‌వలి, ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



కార్మికులతో ఆకుల విజయ్‌కుమార్

నార్పల : విజయదశమి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో పంచాయతీ కార్మికులకు టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్మికులతోపాటు సిబ్బంది సుమారు 26 మందికి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

పామిడి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన టిడిపి కార్యకర్త నిజాముద్దీన్‌కు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న ఈశ్వర్ టిడిపి మండల కన్వీనర్ ఆర్‌ఆర్.రమేష్‌తో ఆర్థికసాయాన్ని పంపారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి వచ్చిన 45 రోజుల్లోనే తమను నమ్మి గెలిపించిన నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంటనూనె విక్రయ కేంద్రాలు ఏర్పాటు



ఆయిల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ మహమూబ్‌బాషా

ఉరవకొండ : పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు వంటనూనె విక్రయ కేంద్రాలను తహశీల్దార్ మహబూబ్‌బాషా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పామోలిన్, సన్‌ఫ్లవర్ ఇంటి వంటనూనెల అధిక ధరలను నివారించేందుకు వంటనూనెల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాలో పామోలిన్, రూ.110, సన్ ఫ్లవర్ నూనె రూ.124కు విక్రయించనున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పందుల యజమానులకు నోటీసులు



పందుల యజమానులకు నోటీసులు అందజేస్తున్న శానిటరీ మేస్త్రీలు

ఉరవకొండ : పట్టణంలో పందులను నివారించడంలో భాగంగా పంచాయతీ అధికారులు పందుల యజమానులకు శుక్రవారం నోటీసులు అందజేశారు. పట్టణంలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నందున ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన శానిటరీ మెస్త్రీల ద్వారా పందుల యజమానులకు నోటీసులు అందజేశారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా పందలుకు ఊరికి దూరంగా తరలించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో హెచ్చరించారు.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు : అనంత

అనంతపురం : జగన్మాత ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాక్షించారు. చెడు మీద మంచి.. దుష్ట శక్తుల మీద దైవ శక్తులు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరారు. లోక కంటకులు, దుష్టశక్తుల మీద.. దైవ శక్తుల స్ఫూర్తిదాయక విజయమే దసరా పండుగ ప్రతీక అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తివంతమైనదైనా అంతిమ విజయం మంచినే వర్తిస్తుందని తెలిపారు. ప్రజలందరికీ సుఖ శాంతులు, సిరి సంపదలను దుర్గామాత ప్రసాదించాలని అభిలషించారు. ప్రతి ఇంట సుఖ సంతోషాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరిసేలా జగన్మాత దీవెనలు లభించాలని ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

'పెన్నోబిలం' ఆలయంలో అవినీతిని అరికట్టాలి

ఉరవకొండ : నియోజకవర్గంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోటు చేసుకుంటున్న అవినీతిని అరికట్టాలని ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత మేనెలలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చలువ పందిళ్లు ఏర్పాటు టెండర్‌ను అనంతపురానికి చెందిన గౌతమ్‌రెడ్డి ఆలయ అధికారులతో కుమ్మక్కై తక్కువ టెండర్‌కు దక్కించుకున్నాడన్నారు. అడ్డదారిలో టెండర్ పొందిన గౌతమ్‌రెడ్డి పనులు చేయకుండా తనకు సబ్ లీజు ఇచ్చాడని వాపోయాడు. తాను పనులు పూర్తి చేసినా గౌతమ్‌రెడ్డి బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడంతోపాటు తనని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఆలయంలో జరుగుతున్న టెండర్ల అవకతవకలను విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తనచేత పనులు చేయించుకుని, బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిన గౌతమ్‌రెడ్డి నుంచి తనకు డబ్బులు ఇప్పించాలని కోరారు.

నార్పల మీదుగా బెంగళూరు

బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-నార్పల

తాడిపత్రి నుంచి నార్పల మీదుగా బెంగళూరుకు వెళ్లే బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు, చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు కోరుతున్నారు. మండల కేంద్రంలో పని చేసుకునే మెకానిక్‌లు, చేనేత కార్మికులు, పలువురు చిరు వ్యాపారులు ముడి సరుకు తెచ్చుకోవడానికి బెంగళూరుకు ఎక్కువగా వెళ్తుంటారు. అదేవిధంగా నార్పల మండలంలో చాలామంది పిల్లలు లేపాక్షి, కొడిగెనహళ్లి, ములుగూరు తదితర గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారు. సెలవు రోజులు, ఆదివారాల సమయాల్లో పిల్లల వద్దకు తల్లిదండ్రులు వెళ్తుంటారు. గతంలో తాడిపత్రి నుంచి బెంగళూరుకు వెళ్లే బస్సు ఉదయం 6 గంటలకు నార్పల మీదుగా వెళ్లేది. తిరిగి రాత్రి 8 గంటలకు నార్పల మీదుగా తాడిపత్రికి చేరుకునేది. వీరందరికీ సంబంధిత సర్వీసు చాలా అనుకూలంగా ఉండేది. ఏమైనా కావాల్సి వస్తే ఉదయం బస్సు ఎక్కి సాయంత్రానికి సరుకులు తీసుకుని నార్పలకు చేరుకునేవారు. ఈనేపథ్యంలో బెంగళూరు బస్సును రద్దు చేయడంతో చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాడిపత్రి నుంచి నార్పల మీదుగా బెంగళూరుకు బస్సును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

స్నేహితుని కుమార్తె చదువులకు చేయూత



గుత్తి : తమ స్నేహితుని కుమార్తె వైద్య విద్యకు తోటి స్నేహితులు చేయూతను అందించారు. స్థానిక ఎంఎస్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదవ తరగతి చదివిన అన్వర్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు ఇటీవల నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. దీంతో తోటి పూర్వపు విద్యార్థులు అన్వర్ ఇంటిని చేరుకుని రూ.50వేలు అందజేశారు. తర్వాత విద్యార్థినని శాలువాతో సత్కరించి అభినందించారు.

14 నుంచి 'పల్లె పండుగ'

పెద్దవడుగూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహినంచనున్నట్లు ఎంపిడిఒ బరాన్‌సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో జరిగే ఈ వారోత్సవాల్లో గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. 14న అప్పేచెర్ల, తిమ్మాపురం, భీమనపల్లి, రావులుడికి, 15న మేడిమాకులపల్లి, చింతలచెరువు, చిత్రచేడు, చిట్టూరు, 16న కొట్టాలపల్లి, దిమ్మగుడి, వీరన్నపల్లి, 17న వెంకటాంపల్లి, కండ్లగూడూరు, విరుపాపురం, లక్షుంపల్లి, మల్లేపల్లి, 18న ముప్పాల గుత్తి, మిడుతూరు, గుత్తి అనంతపురం, కాసేపల్లి, 19న చిన్నవడుగూరు, రాంపురం, పెద్దవడుగూరు, భూర్నాకుంట, 20న కిష్టిపాడు గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-బెలుగుప్ప



సిఐను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

చట్టానికి విరుద్ధంగా అసాంఘిక చర్యలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ఐ శివకు సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, నాటుసారా వంటి అసాంఘి కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. అలాగే దొంగతనాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, జమేదారు బాల నరసింహులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

మండలంలో శాంతి భద్రతలకు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్ తనిఖీకి వచ్చిన సిఐను టిడిపి నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దతిప్పయ్య, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, ఆవులన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, నాయకులు వెంకట్రామిరెడ్డి, గోవిందనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో 'అనంత' పూజలు

ప్రజాశక్తి-నార్పల



చక్ర వెంకటేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి

మండల కేంద్రం లోని వెంకటేశ్వరస్వామి, తిక్కస్వామి ఆలయాలల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. చక్ర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహినంచిన రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దేవుని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఉపసర్పంచి శ్రీరాములు, వైసిపి నాయకులు బొందలవాడ రంగయ్య, జయరామ్‌రెడ్డి, నడిమిదొడ్డి మునిరెడ్డి, తుంపెర పక్కిరెడ్డి, ముచ్చుకుంటపల్లి నారాయణరెడ్డి, మంగపట్నం సంజీవరెడ్డి, గూగూడు శివశంకర్‌రెడ్డి, గంగనపల్లి రమణ, భాస్కర్‌నాయుడు గొల్ల సుధాకర్, గవ్వల సుబ్బయ్య, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నేరాలు ఘోరాలు

గుంతకల్లులో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గుంతకల్లు : పట్టణంలోని హరీష్‌నగర్‌లో ఉన్న ఓ ఇంట్లో జరిగింది. గమనించిన యజమాని శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేసినట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. సంబంధిత ఇంట్లో కొంతకాలంగా నివాసం ఉంటున్న కాకర్ల రంగనాయకులు, సుజాత దంపతులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాకర్ల రంగనాయకులు అనారోగ్యంతో ఉండగా మంగళవారం వైద్య సేవ నిమిత్తం అనంతపురంలోని ఆసుపత్రికి వెళ్లారు. అయితే గురువారం రోజుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో వారు వైద్యుడు సూచన మేరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అందుకు సంబంధించిన వైద్య పరీక్షల ఫలితాలు ఆలస్యం కావడంతో వారు సమీప బంధువుల ఇంట్లో ఉన్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం వారి ఇంటి యజమాని చరవాణి ద్వారా వారి ఇంటిలో చోరీ జరిగిందని తాము పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. దీంతో తాము వెంటనే ఇంటికి రాగా తమ ఇంటి వాకిలికి ఉన్న సేఫ్టీ డోర్, ప్రధాన వాకిలికి ఉన్న గడీలను దుండగులు పగలగొట్టి ఇంట్లో బీరువాలోని రూ.1.20లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దుండగులను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి నమూనాలను సేకరించారు. అదేవిధంగా డాగ్‌స్క్వాడ్ నిందితులను గుర్తించేందుకు ప్రయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఇంకా కొంతకాలంగా గుంతకల్లు పట్టణంలో అనేక ప్రాంతాల్లో చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ నామమాత్రంగా ఉండడంతో దొంగలు ఇదేచ్ఛంగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేసి చోరీలను తిరగకుండా అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

ఘనంగా ఆయుధపూజ

ప్రజాశక్తి-గుత్తి

మండల వ్యాప్తంగా శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా తొండపాడు గ్రామంలోని కొండపై వెలసిన దొనకొండ లక్ష్మమ్మ ఆలయాన్ని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుర్రాల ప్రతాప్, డేగ మద్దిలేటి,



గుత్తిలో ఆయుధ పూజ చేస్తున్న ఛైర్‌పర్సన్ డి.వన్నూర్‌బి, నాయకులు

చిన్నరెడ్డియాదవ్, రంగస్వామిరెడ్డి, అర్చకులు రవికుమార్, రంగనాయకులు, నవీన్‌కుమార్, నిఖిల్, చేతన్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ పాల్గొన్నారు. మండలంలోని సేవాఘడ్‌లో ఉన్న జగన్మాత ఆలయంలో అమ్మవారిని మహిషాసురవర్ధినిగా అలంకరించారు. ఈకార్యక్రమంలో సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్టు నాయకులు పాల్గొన్నారు. గుత్తి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బార్‌మియా ఆయుధపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ హేమచంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, ఎఇ రవికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె. చౌదరి, నాయకులు లక్ష్మణ్ చౌదరి, సొలమాన్‌రాజ్, చికెన్ శీనా, బి.రమేష్, వైసీపీ నాయకుడు డి.షఫీ, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : దసరా నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఆయుధాల పూజ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ వాహనాలు, రక్షణ విభాగంలోని ఆయుధాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామప్రసాద్, ఎఎస్ఐ సంపత్‌కుమార్, జమేదారు శంకర్‌నారాయణ, పోలీసులు రవీంద్రనాథ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, హసీనా బేగం, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ప్రజలు ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు నాగలి, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు పూజలు చేశారు.



సిఫ్లాన్ పరిశ్రమలు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లి వద్ద ఉన్న సిఫ్లాన్ డ్రగ్స్ కంపెనీలో శుక్రవారం ఆయుధ పూజ చేశారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పూజలు చేశారు.

పుట్లూరు : దసరా నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఆయుధాల పూజ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ వాహనాలు, రక్షణ విభాగంలోని ఆయుధాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.